యువతదే భవిష్యత్తు..

మాజీ ఉప రాష్ట్రపతి, పద్మ విభూషణ్ వెంకయ్యనాయుడు



బిట్స్ పిలానీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి, పద్మవిభూషణ్ గ్రహీత వెంకయ్యనాయుడు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో శుక్రవారం లాంచ్‌ప్యాడ్–24 పేరుతో ఎంట్రప్రెన్యూయర్ సదస్సులో ముఖ్య అతిథిగా భారత మాజీ ఉప రాష్ట్రపతి, పద్మ విభూషణ్ వెంకయ్యనాయుడు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి రంగంలో ఇతర దేశాలకు ధీటుగా నిలుస్తుందన్నారు. యువత కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని, దేశం భిన్నమతాలకు నిలయమని, భిన్నత్వంలో ఏకత్వం భారతదేశానికి సాధ్యమని, మన దేశాన్ని ఇతర దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. చదువు కేవలం విజ్ఞానం కోసమే కాదని, సంస్కారం లేని చదువు అక్కర్లేదన్నారు. విద్యార్థులు మార్పునకు ప్రతినిధులు కావాలని, నాయకులుగా అవతరించాలన్నారు. పారిశ్రామిక, వాణిజ్య రంగంలోకి అడుగు పెట్టాలనుకుంటున్న నవతరం ఔత్సాహికులకు లాంచ్‌ప్యాడ్ ఒక సువర్ణ అవకాశమన్నారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ క్యాంపస్ మాజీ డైరెక్టర్ సుందర్, క్యాంపస్ అధికారులు యోగేశ్వరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ మరమ్మతులకు రూ.20 లక్షలు



వాటర్ ట్యాంక్ మరమ్మతులకు శంకుస్థాపన చేస్తున్న చైర్ పర్సన్ ప్రణీత శ్రీకాంత్‌గౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో వాటర్ ట్యాంక్ మరమ్మతుల కోసం రూ.20 లక్షలు కేటాయించామని చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం వాటర్ ట్యాంక్ మరమ్మతులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజీవ్ గృహకల్ప కాలనీలో ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, డీఈ చిరంజీవులు, స్థానిక కౌన్సిలర్ భూక్య నానునాయక్, 2వ వార్డు కౌన్సిలర్ సుజాత శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు కౌకుట్ల తిరుపతిరెడ్డి, రాజేష్, సందీప్, దశరథ్, మహేష్, అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్యనందితకు నివాళి



జవహర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న మేయర్ కావ్య, పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్

జవహర్‌నగర్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని మేయర్ కావ్య అన్నారు. బీఆర్ఎస్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్‌నగర్ అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే లాస్యనందిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, సంగీతరాజశేఖర్, కో–ఆప్షన్ సభ్యురాలు శోభా, నాయకులు మెట్టు వెంకన్న, సుధాకర్‌చారి, ప్రకాష్, కాశీం, మహేష్, శేఖర్, బాలస్వామి, అహ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలపై ఆరా



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుతున్న వైద్యం, సదుపాయాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే పేదలకు సమయానికి, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి వైద్య సిబ్బందికి సూచించారు.

విజేతలకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీశైలంరెడ్డి, యాజమాన్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఇటీవల చైన్నైలోని వీఐటీ కళాశాలలో జరిగిన క్రీడా పోటీల్లో సత్తా చాటారు. క్రికెట్ విజేతలుగా నిలువడంతో శుక్రవారం బహుమతితో కళాశాల చేరుకున్న జట్టు సభ్యులను కళాశాల వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, సెక్రటరి శ్రీశైలంరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై మరింత దృష్టి సారించాలని, తమ కళాశాలలో క్రీడలకు ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రీడా రంగంలోని రాణించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఓడీ కేవీ రెడ్డి, పీడీ రాజేశ్‌గౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రకాశ్ చౌహాన్



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రకాశ్ చౌహాన్, సుబ్రహ్మణ్యం

ఘట్‌కేసర్: జాతీయ స్థాయి సదస్సులు విభిన్న అవకాశాలను అన్వేషించడానికి మార్గం సుగమం చేస్తాయని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ) డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం రెండు రోజుల జాతీయ స్థాయి టెక్నో–కల్చరల్ ఫెస్ట్ దక్ష–3.0కు ముఖ్యఅతిథిగా హాజరై సావనీర్‌ను ఆవిష్కరించారు. గౌరవ అతిథి సీనియర్ డైరెక్టర్ చింతా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జీవితం ఎప్పుడూ సవాలేనని, ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. ఈవెంట్ వైస్ ప్రెసిడెంట్ బాలజీ ఉట్ల, ప్రొఫెసర్ విజయకుమార్, డైరెక్టర్ ఆఫ్ స్ట్రాటజీ అండ్ డిజిటల్ లెర్నింగ్ అనురాగ్ పల్లా, కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కో కన్వీనర్ స్వప్న, రవీందర్‌రెడ్డి, యూనివర్సిటీ డీన్‌లు, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడ్చల్ రాజకీయంలో..
పారని కాంగ్రెస్ పాచికలు

ప్రజాప్రతినిధుల అధికార దాహమో.. నేతల పదవీ కాంక్షనో.. స్థిరత్వంలేని మనస్తత్వమో.. ధనమోహమో కానీ నాయకులు తామున్న పార్టీలను కాదని ఇతర పార్టీలకు మద్దతిచ్చి పదవులు, వాటి ద్వారా డబ్బులు పొందాలని చూస్తున్న నేతల ఆశలు మేడ్చల్ నియోజకవర్గంలో అడియాశలు అవుతున్నాయి. – మేడ్చల్

- ఎమ్మెల్యే మల్లారెడ్డి రాజకీయం ముందు తేలిపోతున్న కాంగ్రెస్ అవిశ్వాస రాజకీయం
- బీఆర్ఎస్‌లో కుంపటి పెట్టి అవిశ్వాసాలకు తెరలేపినా పారని పాచికలు
- మేడ్చల్, నాగారం, తూంకుంట, మున్సిపాలిటీల్లో మల్లారెడ్డి సక్సెస్
- తెరవెనుక నడిపినా సక్సెస్ కాలేని కాంగ్రెస్ నేతలు



అవిశ్వాస తీర్మానం కోసం నిర్వహించిన సమావేశంలో కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి(ఫైల్)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి బీఆర్ఎస్ నుంచి అధికార మార్పిడి కాగానే మొదటగా మున్సిపాలిటీలలో అవిశ్వాసానికి తెరలేచింది. దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉన్నా నేతల మధ్య ఉన్న గొడవలు, గ్రూపు రాజకీయాలు, పదవి కాంక్షలతో రాష్ట్రంలో ఒక్కసారిగా మున్సిపల్ రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. రాజకీయంలో శత్రువులుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్లు, మేయర్‌లను దించడానికి తెర వెనుక ఒకటయ్యాయి. అదే తరహాలో మేడ్చల్ నియోజకవర్గంలో ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లలో కొన్నింట్లో అసమ్మతి రాజకీయానికి తెరలేపారు. తూంకుంట, నాగారం, జవహర్‌నగర్ కార్పొరేషన్లలో బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఒక్కటై అవిశ్వాసం నోటీసులు ఇచ్చి తీర్మానాలు ప్రవేశపెట్టినా వీగిపోయాయి. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్‌కు చెందిన మేయర్ కావ్య పదవి కోల్పోయినా తిరిగి ఆ పదవి బీఆర్ఎస్ కార్పొరేటర్ పొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

తూంకుంట, నాగారంలో ఫెయిల్..

తూంకుంట, నాగారం మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్లను కుర్చీలపై నుంచి దించాలని కాంగ్రెస్ నాయకులు, వారికి అండగా బీజేపీ నాయకులు తెరవెనుక రాజకీయాలు చేసినా ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి రాజకీయం ముందు తేలిపోయారు. తూంకుంటలో మొత్తం 16మంది కౌన్సిలర్లు ఉండగా అందులో బీఆర్ఎస్‌కు 9, కాంగ్రెస్‌కు ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నారు. చైర్మన్‌పై అవిశ్వాసానికి కాంగ్రెస్‌కు చెందిన ఏడుగురు, బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు మద్దతు ఇచ్చారు. అవిశ్వాసానికి కాంగ్రెస్‌కు చెందిన ఒకరు మిగతా బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరు కావడంతో అవిశ్వాసం వీగిపోయింది. అవిశ్వాసం నోటీసు ఇచ్చిన కాంగ్రెస్ వారే గైర్హాజరు కావడంతో తూంకుంటలో కాంగ్రెస్ పరువు పోయింది.



ఫెయిల్ అవుతున్న కాంగ్రెస్ నేతలు..

నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు కాకలు తీరిన యోధులుగా చెప్పుకునే నలుగురు సీనియర్ నాయకులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసిన ఓడిన తోటకూర వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మరో సీనియర్ నేత నక్క ప్రభాకర్‌గౌడ్ ఉన్నారు. నలుగురు ఎమ్మెల్యే మల్లారెడ్డిని ఢీకొట్టేందుకు బేధాభిప్రాయాలు పక్కన పెట్టి ఏకతాటిపై వచ్చి రాజకీయం చేస్తున్న మల్లారెడ్డి ముందు వారి పాచికలు పారడం లేదు. తూంకుంట, నాగారం మున్సిపాలిటీల్లో సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లే అవిశ్వాసం సమావేశాలకు డుమ్మా కొట్టారంటే వారికి కాంగ్రెస్ పార్టీపై నియోజకవర్గంలో ఎంత పట్టుందో స్పష్టమవుతోంది. అదే సమయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎంత పట్టు నిలుపుకుంటున్నాడో రుజువవుతోంది.

నాగారంలో..

నాగారంలో బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది, కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు, బీజేపీకి చెందిన ఒకరు కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసులు ఇచ్చిన వారిలో కొందరు హాజరుకాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయింది.

జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్ బీఆర్ఎస్‌లో అసమ్మతి కట్టలు తెంచుకోవడంతో అక్కడ అవిశ్వాసం సక్సెస్ అయ్యింది. బీఆర్ఎస్‌కు చెందిన 19 మంది కార్పొరేటర్లు, కాంగ్రెస్‌కు చెందిన ఒక కార్పొరేటర్ అవిశ్వాసం నోటీసు ఇచ్చి సమావేశానికి హాజరై మేయర్‌ను పదవి నుంచి దించారు. జవహర్‌నగర్ రాజకీయాన్ని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నీ తానై నడిపించారు. బీఆర్ఎస్ మేయర్ పదవి నుంచి తప్పుకున్నా కాంగ్రెస్‌కు మేయర్ కావడానికి సంఖ్యా బలం లేకుండా పోయింది. కాంగ్రెస్ పార్టీ మేయర్ కోసం వలస నాయకులపై ఆశ పెట్టుకుంది.

ఎమ్మెల్యే మల్లారెడ్డి బలం, రాజకీయ చతురత

మేడ్చల్ మున్సిపాలిటీలో, పీర్జాదిగూడ కార్పొరేషన్ బీఆర్ఎస్ అసమ్మతి ఉన్న మాజీ మంత్రి తన పట్టు నిలుపుకునేందుకు తన వద్ద ఉన్న తాయిలాలను ఇస్తూ నాలుగు రూపాయలు ఖర్చు చేస్తూ ఎవరూ కారు దిగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మొత్తం మీద మేడ్చల్ రాజకీయం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా కొనసాగుతున్నా.. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే పైచేయి కాగా తాజాగా అసమ్మతి రాజకీయాల్లో కారు ఏ మాత్రం జోరు తగ్గకుండా చెయ్యికి అవకాశం ఇవ్వకుండా వేగంగా వెళ్తోంది. ఎమ్మెల్యే మల్లారెడ్డి బలం ముందు, రాజకీయ చతురత ముందు కాంగ్రెస్ గుంపు పూర్తిగా తేలిపోతోంది.

చౌదరిగూడ తైబజార్ వేలానికి దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్: చౌదరిగూడ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఈనెల 26 నిర్వహించనున్న తైబజార్ వేలం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గ్రామ ప్రత్యేక అధికారి సాంబశివరావు తెలిపారు. వేలంపై ఆసక్తి గలవారు వేలం రోజున ఉదయం 9 గంటలలోపు రూ.5 వేలు కార్యదర్శి శశికుమార్ వద్ద డిపాజిట్ చేసి రశీదు పొందాలని, ఈ డబ్బులు తిరిగి ఇవ్వబడవన్నారు. కాంట్రాక్టు పరిమితి ఏప్రిల్ 1 నుంచి మార్చి 31, 2025 వరకు ఉంటుందన్నారు. వేలం పొందిన వారు వెంటనే అగ్రిమెంట్ రాసిచ్చి 50 శాతం డబ్బును పంచాయతీకి చెల్లించాలన్నారు.

బస్తీ దవాఖానా ప్రారంభం



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి 13వ వార్డులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీహోలిస్టిక్ ఆస్పత్రి వారు బస్తీ దవాఖానా ఏర్పాటు చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాములు, ఆస్పత్రి జోనల్ చైర్మన్ వేణుగోపాల్, స్థానిక కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్ ప్రారంభించారు. మున్సిపల్ ప్రజలకు ఆస్పత్రి వైద్యులు ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ అమరం సరస్వతి, ఈఈ నర్సింహారెడ్డి, వైద్యులు మాలినిదేవి, సద్గురు, నాయకులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాలో విజయ సంకల్ప యాత్ర

బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు పి.విక్రంరెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో శనివారం నుంచి ఈ నెల 26 వరకు కొనసాగనున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి తెలిపారు. జిల్లా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా ఈ నెల 27న సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గంలోకి విజయ సంకల్ప యాత్ర ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. మేడ్చల్ రూరల్ జిల్లాలో శని, ఆది, సోమ వారాల్లో ప్రధానంగా జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం, కీసర, మేడ్చల్ కేంద్రాల మీదుగా బీజేపీ విజయ సంకల్ప యాత్ర కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. దమ్మాయిగూడలో విజయ సంకల్ప యాత్రను పురస్కరించుకుని ఆదివారం బహిరంగసభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అనంతరం బీజేపీ విజయసంకల్ప యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు బుద్ది శ్రీనివాస్, అచ్చిని నర్సింహ, జిల్లాల తిరుమల్‌రెడ్డి, అమరం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి కల్యాణం



ఎదులాబాద్‌లో రుక్మిణీ, సత్యభామ శ్రీవేణుగోపాల స్వామి కల్యాణ వేడుకలు



స్వామి కల్యాణంలో భక్తులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవంలో భాగంగా శుక్రవారం శ్రీవేణుగోపాల స్వామి వారి తిరుక్కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అంబారిపేట వంశీయులు విగ్రహ మూర్తులను బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై ప్రతిష్ఠించారు. అనంతరం వేద మంత్రాల మధ్య కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. స్థానిక భక్తులే కాకుండా నగరం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ రవి, మాజీ సర్పంచ్ శంకర్, మహేశ్ ముదిరాజ్, ఆంజనేయులుముదిరాజ్, బట్టి లక్ష్మణ్, రాజేందర్‌గౌడ్ కల్యాణంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజల్లో ఆలయ ధర్మకర్తలు అంబారిపేట అప్పలాచార్యులు, రాంప్రసాద్ ఆచార్యులు, వరదాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యానికి మరింత మెరుగు



ఎఫ్‌డీపీలో అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మైక్రోసాఫ్ట్ అజుర్‌పై ఐదు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగాం(ఎఫ్‌డీపీ) శుక్రవారం ముగిసింది. ఐసీటీ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌డీపీ కార్యక్రమాల్లో అధ్యాపకులు తరచూ పాల్గొనడం వల్ల వారి నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవచ్చని తద్వారా విద్యార్థులను సాంకేతికంగా మరింత ముందుకు తీసుకెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, కన్వీనర్ శోభన్, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలో శనివారం నిర్వహించనున్న సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి పాతగాని గోపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. నాచారంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయ సంకల్ప యాత్ర ఉప్పల్ నుంచి రామంతాపూర్ మీదుగా హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ నుంచి రోడ్‌షోగా నిర్వహించి హెచ్‌బీ కాలనీలో కార్నర్ మీటింగ్ ఉంటుందన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా కొనసాగుతుందన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు, వీరేందర్‌గౌడ్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హాజరవుతారన్నారు. విలేకరుల సమావేశంలో రాంప్రదీప్, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్, ఉప్పల్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొరిగె కృష్ణ, ఎస్టీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ తాళ్లపల్లి లింగం పాల్గొన్నారు.

రేపు బోడుప్పల్‌లో రక్తదాన శిబిరం

బోడుప్పల్: శ్రీపీవీ నర్సింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన బోడుప్పల్ అఖిల బ్రాహ్మణ వికాస సమితి భవనంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి నందకుమార్‌జోషి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రక్తదాన శిబిరం, పీవీ నరసింహారావుకు ఘన నివాళి కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, మాజీ మంత్రి వేణుగోపాలా చారి హాజరవుతున్నట్లు వెల్లడించారు. బోడుప్పల్ బ్రాహ్మణ బంధువులందరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబికా దేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ వెల్లడించారు. అమ్మవారికి ప్రత్యేక అలకంరణతో పాటు అభిషేకం, పూజలు నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి పూజల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

అభినందనలు

గౌతంనగర్: రాజ్యసభ ఎంపీగా నియమితులైన అనిల్‌కుమార్‌యాదవ్‌ను శుక్రవారం పీసీసీ బీసీ సెల్ మాజీ కార్యదర్శి ఆకుల శ్రావణ్‌కుమార్, మల్కాజిగిరి సర్కిల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విమలానంద్ ఆధ్వర్యంలో కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, భాస్కర్, నర్సింగరావు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపైనే జనరేటర్ ఏర్పాటు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని కేశవనగర్ కాలనీలో రోడ్డును ఆక్రమించుకుని జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. బోడుప్పల్ మెయిన్ రోడ్డు నుంచి ఆంజనేయ నగర్‌కు వెళ్లే రహదారి పక్కన ఇటీవల దేవి ఏసీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ నిర్మించారు. 40 అడుగుల రహదారి ఉన్న ఈ రోడ్డులో రోడ్డును ఆక్రమించుకుని సదరు ఫంక్షన్ హాల్ నిర్వాహకులు జనరేటర్‌ను రోడ్డుమీదే ఏర్పాటు చేశారు. దీని వల్ల నిత్యం రద్దీగా ఉండే రహదారిపై ఈ జనరేటర్‌ను ఏర్పాటు చేయడం వల్ల స్థానిక కాలనీల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడనున్నాయి. అధికారులు, స్థానిక కార్పొరేటర్ చొరవ తీసుకుని రోడ్డుపై ఏర్పాటు చేసిన జనరేటర్‌ను తొలగించాలని, లేనిపక్షంలో ధర్నా చేయనున్నట్లు స్థానిక కాలనీవాసులు వెల్లడించారు.

ఏఐఎంఈడీ పోటీ పరీక్షలో భాష్యం విద్యార్థుల ప్రతిభ

గౌతంనగర్: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఏఐఎంఈడీ పోటీ పరీక్షల్లో మల్కాజిగిరి భాష్యం స్కూల్ విద్యార్థులు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి మొదటి ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్కూల్ జెడ్ఈవో మార్కండేయులు, ప్రిన్సిపల్ కోమలి విద్యార్థులను అభినందిస్తూ సర్టిఫికేట్లు, షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో మహిళలు భాగస్వాములు కావాలి



అడిషనల్ డీజీపీ శిఖా గోయల్

మేడ్చల్‌రూరల్: అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు దేశప్రగతిలో పురుషులకు సమానంగా పాల్గొనాలని రాణించాలని ఉమెన్ సేఫ్టీ వింగ్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో అడిషనల్ డీజీపీ, సీఐడీ డైరెక్టర్, ఐపీఎస్ శిఖా గోయల్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని మేడ్చల్ పోలీస్ శిక్షణ కళాశాలలో శుక్రవారం (డబ్ల్యూఎస్‌సీటీపీసీఎస్) మహిళా ఏఆర్ కానిస్టేబుల్స్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు శాఖను ఎంచుకున్న మహిళలు ఉద్యోగంతో పాటు కుటుంబాన్ని కూడా సమర్థవంతంగా నిర్వహించగలుగుతారన్నారు. శిక్షణలో పాల్గొంటున్న అభ్యర్థులు శిక్షణ సమయంలో శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని సాధించాలని, తద్వారా రాబోయే 30 ఏళ్ల పాటు సమాజానికి సమర్థవంతంగా సేవ చేయగలుగుతారని వ్యాఖ్యానించారు. పోలీసు కుటుంబంలోకి రాబోతున్న 422 మంది అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి, సీఐ రవి, పీటీసీ శిక్షకులు, పోలీసు ఉన్నతాధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, సీలింగ్ భూములను కాపాడాలి



సాక్షి, మేడ్చల్‌జిల్లా: దుండిగల్ గండిమైసమ్మ మండలం దుండిగల్ పురపాలక సంఘం పరిధిలోని సర్వే నంబర్లు 282, 284, 321 నుంచి 325, 330 నుంచి 335, 345, 358 నుంచి 362, 423 నుంచి 426 వరకు గల 106.07 ఎకరాల ప్రభుత్వం/సీలింగ్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు చెందిన పలువురు ఉద్యోగులు విలువైన 106.07 ఎకరాల ప్రభుత్వ/సీలింగ్ భూములను ప్రైవేట్ భూములుగా చూపిస్తూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దారాదత్తం చేశారని ఆయన ఆరోపించారు. ఈ భూముల్లో ప్లాట్లు చేసి విక్రయించేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని ఆయన కోరారు. ఈ సమస్యను పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులతో సహా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్‌తో సహా రెవెన్యూ అధికారులు సత్వరమే స్పందించి, భూమార్పిడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని 106.07 ఎకరాల ప్రభుత్వం/సీలింగ్ భూములను కాపాడాలని కోరారు.

వివాదంలో పోచారం డంపింగ్ యార్డు

చెత్త సేకరణ వాహనాలను అడ్డుకున్న యువకులు



డంపింగ్ యార్డులోకి వెళ్లకుండా అడ్డంగా నిలిపిన వాహనాలు

పోచారం: యంనంపేట్‌లో పోచారం మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డు వివాదాస్పదంగా మారింది. చెత్త డంపింగ్ చేస్తున్న భూమి తనదని యంనంపేట్ ప్రాంతానికి చెందిన పోలగోని రాజేష్ గౌడ్ చెబుతున్నారు. ఈ డంపింగ్ యార్డు చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు రెండు రోజుల క్రితం కౌన్సిల్ తీర్మానం చేసింది. దీంతో శుక్రవారం డంపింగ్ యార్డులో చెత్త వేయకుండా రాజేష్‌తో పాటు కొందరు యువకులు అడ్డుకున్నారు. సర్వే నంబర్ 137/1లో తనకు చెందిన 2.27 ఎకరాల భూమిలో చెత్త డంప్ చేస్తున్నారని రాజేష్ ఆరోపించారు. చెత్త డంప్ చేయొద్దని మున్సిపల్ అధికారులను గతంలో పలుమార్లు కోరామన్నారు. కొత్తగా డంపింగ్ యార్డు చుట్టూ రేకులతో ఫెన్సింగ్ పనులు చేపట్టేందుకు కౌన్సిల్ తీర్మానం చేయడంతో చెత్త డంప్ చేయకుండా వాహనాలను అడ్డుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఈ సమస్యపై మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమనరెడ్డితో వీరు చర్చించారు. యంనంపేట్‌లోని సర్వే నంబర్లు 137, 138లోని లేఅవుట్‌లో ఖాళీ జాగా నిమిత్తం కేటాయించిన ప్రదేశంలోనే తాత్కాలికంగా చెత్త డంప్ చేస్తున్నామని, త్వరలో ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని సర్వే నెంబర్ 46/1లోకి డంపింగ్ యార్డును తరలిస్తామని లిఖితపూర్వకంగా అధికారులు హామీ ఇచ్చారు. ప్రస్తుతం డంపింగ్ చేస్తున్న ప్రదేశం మున్సిపాలిటీకే చెందుతుందని, ఇతరులు ఎవరైనా హక్కుదారులమని వస్తే కోర్టులో నిరూపించుకోవాలని నోటీసు ఇచ్చారు.